# జిల్లాకు గులాబీ బాస్

- నేడు వేల్పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ
- ప్రజలకు దిశానిర్దేశం చేయనున్న సీఎం
- భారీ ఏర్పాట్లు చేసిన మంత్రి వేముల
- స్వచ్ఛందంగా తరలిరానున్న జనం
- ఎన్నికల ఖర్చుకోసం రూ.50వేలు ఇచ్చిన భీమ్‌గల్ కర్షకుల సంఘం


మంత్రి వేములకు చెక్కును అందిస్తున్న భీమ్‌గల్ కర్షకుల సంఘ సభ్యులు

కమ్మర్‌పల్లి/వేల్పూర్, నవంబర్ 1:బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన నేడు వేల్పూర్‌కు రానున్నారు. మంత్రి వేముల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించనున్నారు. ప్రశాంత్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరనున్నారు. కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మంత్రి వేముల భారీ ఏర్పాట్లు చేశారు. వేల్పూర్ ఎక్స్‌రోడ్‌లోని స్పైసెస్ పార్కు ఆవరణలో ఈ సభను నిర్వహించనున్నారు. భారీగా జన సమీకరణ చేసే పనుల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు నిమగ్నమయ్యారు. 55 వేల మందికిపైగా తరలిరానున్న ఈ సభకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదికతో పాటు చుట్టు పక్కల ప్రాంతం మొత్తాన్ని గులాబీ తోరణాలతో అలంకరించారు. పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ గ్యాదరి బాలమల్లుతో కలిసి సభ ఏర్పాట్లను మంత్రి వేముల బుధవారం పరిశీలించారు. మధ్యాహ్నం ఒంటిగంటలోపే సభకు చేరుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

**రూ.50 వేలు ఇచ్చిన కర్షక సంఘం**

భీమ్‌గల్ కర్షకుల సంఘం మంత్రి వేములకు సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ మేరకు మద్దతు తీర్మానంతో పాటు ఎన్నికల ఖర్చు కోసం మంత్రి వేములకు రూ.50 వేలు అందజేశారు. వారి అభిమానానికి ముగ్ధుడైన ప్రశాంత్‌రెడ్డి.. సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

**భారీగా జన సమీకరణ**

ఉద్యమ కాలం నుంచే బాల్కొండ బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రెండుసార్లు పోటీ చేసిన వేముల భారీ మెజార్టీతో విజయం సాధించారు. మూడోసారి బరిలో నిలిచిన ఆయన ప్రతిపక్షాలకు అందనంత వేగంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. సంక్షేమ పథకాలు పొందిన లక్షలాది మంది స్వచ్ఛందంగా వేల్పూర్‌కు తరలిరానున్నారు. మరోవైపు, కేసీఆర్ సభకు భారీగా జన సమీకరణ చేసేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. స్వచ్ఛందంగా తరలిరానున్న ప్రజల కోసం రవాణా ఏర్పాట్లు చేస్తున్నారు.

# గుణాత్మక విద్యను బోధించాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి


మాట్లాడుతున్న పార్థసారథి

నిజామాబాద్ స్పోర్ట్స్/ఆర్మూర్ టౌన్, నవంబర్ 1: విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు వారిలో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందిస్తూ గుణాత్మక విద్యను బోధించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. తన తల్లిదండ్రులు చిట్ల ప్రమీల-జీవన్‌రాజ్ పేరిట నెలకొల్పిన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో బుధవారం పెర్కిట్‌లో విద్యాస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మండల పరిధిలోని 21 జడ్పీహెచ్‌ఎస్‌లు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు, ఆంగ్ల మాధ్యమంలో గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించే 140 మంది ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యాల పెంపుపై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్సీఆర్‌టీ) నిపుణులతో ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో పాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, డీఈవో దుర్గాప్రసాద్, డీఐఈవో రఘురాజ్, డీపీవో జయసుధ హాజరయ్యారు. విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో ఇంగ్లిష్‌లో వారి సామర్థ్యాలను పెంపొందించేలా ఎలా బోధించాలనే అంశాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు.అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

# బంగారు కొండగా బాల్కొండ..

- రూ.2 వేల కోట్లతో సాగునీటి రంగ పునర్జీవం
- రూ.650 కోట్లతో బీటీ రోడ్లు, వంతెనలు, సీసీరోడ్లు
- మంత్రి వేముల కృషితో అన్ని రంగాల్లో సమూల ప్రగతి


ఎస్సారెస్పీ పునర్జీవం పథకంతో ముప్కాల్ పంపు హౌస్ వద్ద ఎస్సారెస్పీలోకి విడుదలవుతున్న కాళేశ్వరం జలాలు

కమ్మర్‌పల్లి, నవంబర్ 1 :మంత్రి వేముల నాయకత్వంలో బాల్కొండ నియోజకవర్గం సమూల ప్రగతికి, అద్భుతమైన అభివృద్ధికి చిరునామాగా మారింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు కేసీఆర్ పాలనలో మోక్షం కలిగింది. తాగు, సాగునీటితో అల్లాడిపోయిన 'అల్లకొండ' నియోజకవర్గం ఇప్పుడు ఊట చెలిమెగా మారింది. ఎస్సారెస్పీ పునరుజ్జీవం, లిఫ్టులు, చెక్ డ్యాంల నిర్మాణంతో క'న్నీటి' కష్టాలకు చెక్ పడింది. సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బాల్కొండను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఉద్యమ నాయకుడైన కేసీఆర్‌కు సన్నిహితుడిగా ఉన్న వేముల.. భారీగా నిధులు తేవడంతో అన్ని రంగాల్లో సమూల ప్రగతికి చిరునామాగా బాల్కొండ నియోజక వర్గం నిలిచింది.

**తీరిన సాగునీటి చింత..**

పదేండ్ల ముందు బాల్కొండ నియోజకవర్గం సమస్యలమయంగా ఉండేది. నియోజక వర్గంలోనే ఎస్సారెస్పీ ఉన్నా ఉపయోగం సున్నా అనే పరిస్థితి ఉండేది. నాన్ కమాండ్ ఏరియా రైతులు బోరుబావులపైనే ఆధారపడేవారు. కరెంటు సరిపోక మోటార్లు కాలిపోయి పంటలు ఎండిపోయేవి. ఎమ్మెల్యేగా గెలిచిన అనతి కాలంలోనే మంత్రి ప్రశాంత్‌రెడ్డి దీనిపై దృష్టి సారించి అసెంబ్లీలో ప్రస్తావించారు. కొత్తగా 18 విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించి 3 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 45 ఏర్పాటు చేయించారు. కేసీఆర్ సహకారంతో రూ.2 వేల కోట్లతో ఎస్సారెస్పీ పునర్జీవం పథకం నిర్మించి ఎస్సారెస్పీతో పాటు నియోజకవర్గంలో సాగు నీటి రంగం మొత్తానికి కొత్త జీవం పోశారు. వరద కాలువను మూడు కాలాలు నిండుగా ఉంచుతూ చెరువులు నింపుకునేలా భారీ తూములు నిర్మించారు. రూ.2400 కోట్లతో ప్యాకేజీ21 ద్వారా.. నియోజకవర్గంలో ఎస్సారెస్పీకి దూరంగా ఉన్న భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, మోర్తాడ్ మండలాల్లో 78 వేల ఎకరాలకు సాగు నీటిని అందించుకుని దశాబ్దాల దారిద్ర్యాన్ని దూరం చేసే అవకాశం కల్పించారు. నియోజక వర్గంలో 45 కిలోమీటర్ల పొడవునా వట్టి పోతున్న వాగులు 24 చెక్ డ్యామ్‌లతో భూగర్భ జల గనులుగా మారి వాగుల వెంట 32 గ్రామాల్లో 50 వేల ఎకరాలకు సాగు ప్రయోజనాన్ని అందిస్తున్నాయి.

**సకల వసతులు..**

ప్రజా ఆశీస్సులతో రెండుసార్లు గెలిచి మంత్రి పదవి చేపట్టిన వేముల సీఎం కేసీఆర్ సహకారంతో రూ.600 కోట్లతో నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లోనూ బీటీ, సీసీరోడ్లు వేయించారు. భీమ్‌గల్‌ను మున్సిపాలిటీగా మార్చి, వంద కోట్లతో భీమ్‌గల్ రైపురేఖలు మార్చేశారు. మిగతా మండలాల కేంద్రాల్లో ఫోర్‌లేన్ రోడ్లు నిర్మించి, సెంట్రల్ లైటింగ్‌తో సౌకర్యవంతంగా మార్చేశారు. భీమ్‌గల్‌లో రూ.37 కోట్లతో వంద పడకల దవాఖానను మంత్రి వేముల మంజూరు చేయించారు. ప్రజల దశాబ్దాల కల నెరవేర్చి వైద్యరంగాన్ని బలోపేతం చేశారు. నియోజక వర్గంలో కొత్త పీహెచ్‌సీలు, గ్రామగ్రామాన హెల్త్ సబ్ సెంటర్లు ఏర్పాటు చేయించారు. 12 వేల మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.50 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. తన సతీమణి, మిత్రుల సహకారంతో రూ.1.60 కోట్లతో అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ పడకల సౌకర్యం కల్పించి రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఆక్సిజన్ ఉత్పత్తి, బాటిలింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయించారు.

# కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

## బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పిలుపు


ఆర్మూర్‌లో సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్/ఆర్మూర్ టౌన్, నవంబర్1: ఎన్నిక ప్రచారంలో భాగంగా ఈ నెల 3న ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డులో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో ప్రజా ప్రతినిధలు , నాయకులు, కార్యకర్తలతో ప్రజా ఆశీర్వాద సభకు జన సమీకరణ ఏర్పాట్లపై బుధవారం సమావేశం నిర్వహించారు. సభకు గ్రామాల నుంచి ప్రజలను అధిక సంఖ్యలో తరలించాలని సూచించారు. అనంతరం సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పరిశీలించారు.

# గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

- ఓట్ల కోసం మాయమాటలు చెబుతున్నది..
- అఖిల భారత రైతు సంఘాల నాయకుల సమావేశంలో రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


మంత్రి వేముల సమక్షంలో మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతునాయకుడు రాఘవేంద్రకుమార్

వేల్పూర్, నవంబర్ 1: ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల పేరుతో డ్రామాలు ఆడుతున్నదని, ప్రజలకు మాయమాటలు చెబుతున్నదని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రైతుల బాగు కోరే కేసీఆర్ లాంటి నాయకుడికి మద్దతుగా నిలువాలని కోరారు. కేసీఆర్ గెలిస్తే రైతు గెలిచినట్లేనని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో రైతు నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు అధ్యక్షతన అఖిల భారత రైతు సంఘాల నాయకుల సమావేశం బుధవారం నిర్వహించగా.. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.కేసీఆర్‌ను కాదనుకుంటే తినే పల్లెంలో మన్ను పోసుకున్నట్లేనని అన్నారు. కాంగ్రెస్ ఇక్కడ గొప్పలకు పోతూ అమలుకు నోచుకోని హామీలిస్తోందని, కానీ ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రైతులను అరిగోస పెడుతుందని మండిపడ్డారు. కేసీఆర్ లాంటి రైతు పక్షపాతి నాయకుడిని కాపాడుకోవడానికి వారు ఇక్కడికి వచ్చి రైతులను చైతన్యం చేస్తున్నారని అభినందించారు. రైతుల బాగు కోరే కేసీఆర్ లాంటి నాయకునికి మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు.

**మేము మోస పోయాం..మీరు మోసపోకండి..**

కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం గ్యారంటీలు అని అబద్ధాలు చెబుతుందని, కర్ణాటకలో తాము నమ్మి ఓట్లు వేసి మోసోయామని, తెలంగాణ ప్రజలు మోసపోకండని కర్ణాటక రైతు సంఘ నాయకుడు పరుశురాం లక్ష్మణ్ అన్నారు. రఘునాథ్ దాదా (పాటిల్, శెబ్కారి సంఘటన్, మహారాష్ట్ర), రాఘవేంద్ర కుమార్ (ఉత్తరప్రదేశ్ - కృషి భూమి బచావో మోర్చా ), సేవాసింగ్ ఆర్య (హర్యానా - బీకేయు), కేఎం. రామగౌండర్ (తమిళనాడు - తమిళ్ వ్యవ సా య సంఘం), పరశురాం లక్ష్మణ్ (కర్ణాటక - ఫార్మర్స్ అసోసియేషన్ కర్ణాటక), డాక్టర్ మంగిరాం (హర్యానా), కె.నాగరాజు (కర్ణాటక), అన్మంతరాజు (తమిళనాడు),బాలసాహెబ్ వాడ్కే (మహారాష్ట్ర) పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**

★ నేను Borra Mallesh S/o. Borra Balaiah R/o. H.No.1-9, Mothe (V) Lingampet (M), Kamareddy (Dist.) నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. T4757701 గలది. Date: 04-10-2023 మోతె నుండి లింగంపేట్‌కు ఆటోలో వెళ్ళుచుండగా పోయినది. దయచేసి ఎవరికైనా దొరికినచో ఈ సెల్: 76739 98873 కు సంప్రదించగలరు. NTZ-313520

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600. NT-320535

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590

**BUSINESS OFFER**

★ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న *బయోడిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468. NT-320324-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.